సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం ׀ 14 ׀ మార్చి ׀ 2023



శిరస్త్రాణం.. ప్రాణం పదిలం

హెల్మెట్ ధరించడంపై వాహనచోదకులకు ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. 'హెల్మెట్‌తో ప్రాణాలు భద్రం' అనే నినాదంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

8లో..



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.59,040
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,273
3 శాతం జీఎస్టీతో	రూ.5,431
సవర (8 గ్రా)	రూ.43,448

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.8 /23.9

సోమవారం గాలిలో 38 శాతం తేమ ఉంది. జిల్లాలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. మంగళవారం వాతావరణంలో ఎలాంటి మార్పు ఉండదు.

న్యూస్‌రీల్

ఒకటో యూనిట్లో ఉత్పత్తికి బ్రేక్



ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీ జెన్‌కో ప్రాజెక్టులో సాంకేతిక కారణాలతో సోమవారం ఒకటో యూనిట్ నుంచి విద్యుదుత్పత్తి నిలిపేశారు. రెండో యూనిట్లో 455 మెగావాట్లు, మూడో యూనిట్లో 630 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతున్నట్టు ప్రాజెక్టు ఇంజినీర్లు వెల్లడించారు.

నేటి నుంచి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

- డీఎంహెచ్‌ఓ పెంచలయ్య



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య

మనుబోలు: నులిపురుగుల నివారణలో భాగంగా నేటి నుంచి జిల్లాలో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ విద్యాసంస్థల్లో మంగళవారం మధ్యాహ్న భోజనానంతరం మాత్రలు వేస్తారన్నారు. ఒకటి నుంచి 19 సంవత్సరాల వయసున్న వారికి మాత్రలు ఇస్తామని తెలిపారు. 1, 2 సంవత్సరాల పిల్లలకు అర మాత్రను నీటిలో కలిపి తాగించాలన్నారు. జిల్లాలో సుమారు 30 శాతం మందికి రక్తహీనత ఉన్నట్లు గుర్తించామన్నారు. వారికి ఉచితంగా మందులు అందజేస్తామని తెలిపారు. జిల్లాలో 120 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లకు సొంత భవనాల నిర్మాణం పూర్తయిందన్నారు. ఆస్పత్రుల్లో మందులు, సిబ్బంది కొరత లేదన్నారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాజు, వైద్య సిబ్బంది తదితరులున్నారు.

రైతులకు ఇబ్బందుల్లేకుండా చూస్తాం



రైతులతో మాట్లాడుతున్న డీఎం వెంకటేశ్వర్లు

జలదంకి: ధాన్యం విక్రయించే విషయంలో రైతులకు ఇబ్బందుల్లేకుండా చూస్తామని జిల్లా పౌరసరఫరాల శాఖ డీఎం వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం ఆయన బ్రాహ్మణక్రాక ఆర్బీకేని పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు పలు సమస్యలను డీఎం దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన స్పందించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వీఏఏ ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

డీసీపల్లిలో 355 పొగాకు బేళ్ల విక్రయం



పొగాకు బేళ్లు (ఫైల్)

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో సోమవారం 355 పొగాకు బేళ్లు విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 417 బేళ్లు రాగా వాటిలో 355ను విక్రయించామన్నారు. మిగిలిన 62 బేళ్లలో 5 నోసేల్, 53 నోబిడ్, 4 సీఆర్‌గా గుర్తించామన్నారు. మొత్తంగా 48,263 కిలోల పొగాకు అమ్ముడు కాగా రూ.94,43,806ల వ్యాపారం జరిగింది. కిలోకు గరిష్టంగా రూ.200, కనిష్టంగా రూ.193, సగటు ధర రూ.195.67 లభించింది. వేలంలో 6 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.



బుచ్చిరెడ్డిపాలెం: డీఎల్ఎన్ఆర్ స్కూల్లో ఓటు వేసేందుకు బారులు తీరిన పట్టభద్రులు

బారులు తీరి.. ఓటు వేసి..

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

- అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్
- పర్యవేక్షించిన కలెక్టర్, ఎస్పీ
- ఓటు వేసిన ప్రముఖులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: తూర్పు రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో 22 మంది అభ్యర్థులు ఉండగా 129 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే టీచర్స్ ఎమ్మెల్సీ పోటీలో 8 మంది ఉండగా 40 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ సాగింది. 4 గంటల వరకు క్యూలో ఉన్న వారికి టోకెన్లు ఇచ్చి పోలింగ్ కొనసాగించడంతో కొన్నిచోట్ల 5.30 గంటల వరకు కూడా ఓటింగ్ సాగింది. పోలింగ్ ప్రక్రియ పారదర్శకంగా జరిగేందుకు 169 మందితో తొలిసారిగా అన్ని కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశారు. దీని ద్వారా ఓటింగ్ సరళిని కలెక్టర్ చక్రధర్‌బాబు, డీఆర్వో వెంకటనారాయణమ్మ కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మానిటరింగ్ సెంటర్ నుంచి పరిశీలించారు. ఎప్పటికప్పుడు పోలింగ్ అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు. అలాగే అన్ని పోలింగ్ కేంద్రాల్లో సూక్ష్మ పరిశీలకులను నియమించారు. వీడియో తీశారు. నెల్లూరులోని డీకేడబ్ల్యూ కాలేజీలో పోలింగ్ సరళిని కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు, ఎస్పీ విజయారావు పరిశీలించారు.

ఓటింగ్ ఇలా..

- టీచర్ ఎమ్మెల్సీకి సంబంధించి 8,165 ఓట్లు ఉండగా సాయంత్రానికి 7,215 ఓట్లు పోలయ్యాయి. ఓటు వేసిన వారిలో పురుషులు 4,303 మంది, స్త్రీలు 2,912 మంది ఉన్నారు. 88.36 శాతం సరాసరి ఓటింగ్ నమోదైనట్లు అధికారులు ప్రకటించారు.
- పట్టభద్రులకు సంబంధించి జిల్లాలో 1,07,632 మంది ఓటర్లు ఉండగా వారిలో 23,757 మంది స్త్రీలు, 44,596 మంది పురుషులు, 342 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా కలిపి మొత్తం 68,695 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 63.82 శాతం నమోదైంది.

ఓటు వేసిన కలెక్టర్ దంపతులు

కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు, ఆయన సతీమణి కిరణ్మయి నెల్లూరు డీకేడబ్ల్యూ కళాశాలలో పట్టభద్రుల స్థానానికి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందరిలాగే క్యూలో నిలబడి ఓటేశారు.

ప్రశాంతంగా జరగడం సంతోషకరం

పోలింగ్ అనంతరం సాయంత్రం కలెక్టర్ చక్రధర్‌బాబు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడారు. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు చాలా ప్రశాంతంగా జరిగాయన్నారు. సిబ్బందికి ముందుగానే రెండుదఫాలు శిక్షణ ఇచ్చామన్నారు. శిక్షణలో తక్కువ మార్కులు వచ్చిన వారికి మరోదఫా శిక్షణ ఇచ్చి ఎలాంటి తప్పిదం లేకుండా ప్రక్రియ సవ్యంగా జరిగేలా చూశామన్నారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి 30 నుంచి 35 శాతం అదనంగా పోలింగ్ జరిగిందన్నారు. ఇందుకు ప్రధాన కారణం ఓటర్లు చైతన్యం కావడమే అన్నారు. ఎక్కువ మంది ఓటు వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేశారన్నారు. 1,750 మంది సిబ్బందిని, 1,350 మంది పోలీసులను పోలింగ్ నిర్వహణకు వినియోగించామని తెలిపారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించిన జిల్లా ప్రజలకు, అధికారులకు, రాజకీయ పార్టీల నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.



నెల్లూరు డీకేడబ్ల్యూ కాలేజీలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న కలెక్టర్ చక్రధర్‌బాబు దంపతులు



గూడూరులో పోలింగ్ సరళిని పరిశీలించేందుకు వెళ్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

కందుకూరు టాప్

నెల్లూరు(అర్బన్): ఎమ్మెల్సీ ఎన్నికల్లో కందుకూరు డివిజన్‌లో అత్యధికంగా పోలింగ్ శాతం నమోదైంది. పట్టభద్రులకు సంబంధించి ఉదయం 10 గంటలకు 11.58 శాతం, 12 గంటలకు 29.18 శాతం, 2 గంటలకు 49.02 పోలింగ్ ముగిసే సమయానికి 72.09 ఓటింగ్ నమోదైంది. అలాగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి ఉదయం 10 గంటలకు 24.57 శాతం, 12 గంటలకు 60.29, 2 గంటలకు 79.29, ఓటింగ్ ముగిసే సమయానికి 96.14 శాతం ఓటింగ్ నమోదైంది. ఓటింగ్ శాతాన్ని పెంచినందుకు అక్కడి అధికారులను కలెక్టర్ అభినందించారు.

టీచర్స్ ఎమ్మెల్సీ సరాసరి ఓటింగ్ : 88.36 శాతం
పట్టభద్రుల ఓటింగ్ : 63.82 శాతం

డివిజన్ల వారీగా పోలింగ్ శాతం ఇలా..

డివిజన్	సమయం	పట్టభద్రులు	ఉపాధ్యాయులు
కందుకూరులో	ఉదయం 10	11.58	24.57
	మధ్యాహ్నం 12	29.18	60.29
	2.00	49.02	79.29
	4.00	72.09	96.14
కావలిలో..	ఉదయం 10	8.15	15.04
	మధ్యాహ్నం 12	26.46	40.36
	2.00	45.24	61.92
	4.00	67.00	90.87
ఆత్మకూరులో..	ఉదయం 10	11.47	11.45
	మధ్యాహ్నం 12	24.44	64.47
	2.00	41.60	82.72
	4.00	64.11	94.71
నెల్లూరులో..	ఉదయం 10	8.02	16.81
	మధ్యాహ్నం 12	22.80	32.14
	2.00	41.19	43.03
	4.00	60.00	85.39

కొత్త ఒరవడికి శ్రీకారం చుడతాం

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డి



నెల్లూరులో ఓటు వేసిన చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(సెంట్రల్): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించి కొత్త ఒరవడికి శ్రీకారం చుడతానని వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం నెల్లూరులోని డీకేడబ్ల్యూ ఆయన కళాశాలలో ఓటు వేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రైవేట్ ఉపాధ్యాయులను గుర్తించి ఓటు హక్కు కల్పించడం చాలా సంతోషంగా అన్నారు. గతంలో ఒక యూనియన్ సభ్యులే గెలుస్తూ వచ్చారన్నారు. ఈసారి పరిస్థితి మారబోతుందన్నారు. ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. విప్లవాత్మక మార్పులు తెచ్చిందని గుర్తుచేశారు.

చిత్తూరుకు బ్యాలెట్ బాక్స్‌ల తరలింపు



నెల్లూరు(అర్బన్): జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ సోమవారం సాయంత్రంతో ముగిసింది. నెల్లూరుతో పాటు ఆత్మకూరు, కందుకూరు, కావలి డివిజన్ల నుంచి సీల్ వేసిన పోలింగ్ బాక్స్ లు, రికార్డులు, ఇతర మెటీరియల్‌ను చిత్తూరు జిల్లాకు తరలించారు. నెల్లూరు డీకేడబ్ల్యూ కళాశాల ఆవరణలో ఈ ప్రక్రియను కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు పరిశీలించి అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. పోలీసు బందోబస్తు నడుమ బాక్స్‌లను చిత్తూరు ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు తరలిస్తున్నామని వివరించారు.

ప్రజలంతా సీఎం వైఎస్ జగన్ వైపే..

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు మాదే
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



ఓటు వేసి సిరా గుర్తును చూపుతున్న కాకాణి

పొదలకూరు: 'ప్రజలంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైపే ఉన్నారు. ఆయన నాయకత్వాన్ని బలంగా కోరుకుంటున్నారు.' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పొదలకూరు 155వ పోలింగ్ కేంద్రంలో మంత్రి సోమవారం పట్టభద్రుల ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక రామనగర్‌గేటు సెంటర్‌లో మంత్రి విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీలు కుయుక్తులు పనిచేయవన్నారు. వైఎస్సార్‌సీపీ బలపరిచిన పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి గెలుపు ఖరారైనట్టు తెలిపారు. సీఎం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులవుతున్న పట్టభద్రులు విచక్షణతో ఓటు వేసేందుకు వచ్చారన్నారు. ప్రభుత్వానికి అండగా నిలిచేందుకు దూరప్రాంతాల నుంచి కూడా వచ్చి ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారన్నారు. మంత్రి వెంట వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, కోనం చినబ్రహ్మయ్య, వాకాటి శ్రీనివాసులురెడ్డి, మద్దిరెడ్డి రమణారెడ్డి, డి.విజయభాస్కర్‌రెడ్డి, పి.లచ్చారెడ్డి, పీ.అశోక్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డీకేడబ్ల్యూ కాలేజీలో ఓటు వేసి వెళ్తున్న రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



నెల్లూరు: ఓటు వేసి సిరా గుర్తును చూపుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్



అల్లూరు: ఓటు వేసిన రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు



కావలిలో ఓటు వేసిన ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



కందుకూరులో ఓటు వేస్తున్న ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి



మర్రిపాడు: దివ్యాంగుడిని పోలింగ్ కేంద్రంలోకి తీసుకెళ్తున్న పోలీసులు



సోమశిల : చంటిబిడ్డతో వెళ్లి ఓటు వేసిన మహిళ



మా వాళ్ల సహకారం ఎలా ఉంది? : డీకేడబ్ల్యూ కాలేజీలో టీడీపీ, పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు శ్రీకాంత్ (గ్రాడ్యుయేట్స్), బాబురెడ్డి (టీచర్స్)

పటిష్ట బందోబస్తు మధ్య..




డీకేడబ్ల్యూ కాలేజీలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న ఎస్పీ విజయారావు

నెల్లూరు(క్రైమ్): 'పటిష్ట బందోబస్తు మధ్య ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగాయి. సమర్థవంతంగా బందోబస్తు విధులు నిర్వహించిన అధికారులు, సిబ్బందికి అభినందనలు.' అని ఎస్పీ సీహెచ్ విజయారావు తెలిపారు. నెల్లూరు నగరంలోని డీకేడబ్ల్యూ కళాశాల, కావలి, గుడ్లూరుల్లోని పోలింగ్ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లను సోమవారం ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించి సాయుధ బలగాలను మోహరించామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్‌ను అమలు చేసినట్లు తెలిపారు. ఓటర్లకు అసౌకర్యం కలగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. కట్టుదిట్టమైన భద్రత నడుమ బ్యాలెట్ బాక్స్‌లను చిత్తూరుకు తరలించినట్లు తెలిపారు.

- నెల్లూరు నగరంలో పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ నాయకుడు అబ్దుల్ అజీజ్ దౌర్జన్యం చేసిన విషయాన్ని బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ రాములునాయక్ ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. డీకేడబ్ల్యూ కళాశాలలోనూ టీడీపీ నేతలు విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. వారిపై చర్యలకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది.

సోమశిలలో 57.579 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో సోమవారం సాయంత్రానికి 57.579 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్ డెల్టాకు 2,100 క్యూసెక్కులు, ఉత్తరకాలువకు 473, దక్షిణ కాలువకు 400, కండలేరుకు 100 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 97.646 మీటర్ల నీటి మట్టం ఉంది. సగటున 319 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వృథా అవుతోంది.



సోమశిల జలాశయం (ఫైల్)

పెన్నమ్మ ఒడిలో 'రంగడి' విహారం



ఉభయదేవేరులతో తెప్పపై తల్పగిరి రంగనాథస్వామి

- నేత్రపర్వంగా తల్పగిరి రంగనాథస్వామి తెప్పోత్సవం
- ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు

నెల్లూరు(బృందావనం): నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీదేవీ భూదేవీ సమేత తల్పగిరి రంగనాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఆఖరిరోజు పవిత్ర పినాకినీ నదిలో రంగనాథస్వామి తెప్పోత్సవం నేత్రపర్వంగా జరిగింది. సింహపురి క్షేత్రపాలకుడు రంగనాథస్వామి ఉభయదేవేరులతో సర్వాలంకార శోభితంగా కొలువై నయనానందకరంగా విహరించారు. తెప్పోత్సవాన్ని వీక్షించేందుకు తరలివచ్చిన అశేష భక్తజనంతో రంగడి సన్నిధి కళకళలాడింది. తొలుత ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి జగన్నాథాచార్యులు, నిశింద సుదర్శనాచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఉభయకర్తలుగా తల్పగిరి రంగనాథస్వామి భక్తబృందం వ్యవహరించింది. కార్యక్రమాలను దేవస్థానం కార్యనిర్వహణాధికారి డి.వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ ఐ.శివకుమార్ ఆచారి, సభ్యులు పర్యవేక్షించారు.

శిరస్త్రాణం.. ప్రాణం పదిలం

యువత ద్విచక్రవాహనం ఎక్కితే చాలు మితిమీరిన వేగం, మద్యం మత్తులో వాహనాలు నడపడం, ట్రాఫిక్ నిబంధనలపై కనీస అవగాహన లేకపోవడంతో ప్రమాదాల బారిన పడి మృత్యువాత పడుతున్నారు. అనువైన రహదారులు, గ్రామీణ ప్రాంతాల్లో సూచికల్లేని మలుపుల్లో వేగాన్ని నియంత్రించలేక ప్రమాదాలకు గురవుతున్నారు. కనీసం హెల్మెట్ ధరిస్తే ప్రాణాలు కోల్పోకుండా గాయాలతోనైనా బయటపడే అవకాశం ఉంది. శిరస్త్రాణం ధరించి ద్విచక్రవాహనాలు నడిపితే ప్రాణాలను కాపాడుకోవచ్చని పోలీసులు సూచిస్తున్నారు.



ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించడంపై గాంధీబొమ్మ సెంటర్‌లో ప్లకార్డులు ప్రదర్శిస్తూ అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు(ఫైల్)

- అత్యధిక ప్రమాదాల్లో తలకు తీవ్రగాయాలై మృత్యువాత
- ప్రమాదాల నివారణకు పోలీసుల చర్యలు
- హెల్మెట్ ధరించడంపై వాహన చోదకులకు విస్తృత అవగాహన

నెల్లూరు(క్రైమ్): గత నెల 19వ తేదీన సంగం మండలం ర్యాంపు సమీపంలో బైక్‌ను కారు ఢీకొంది. ఈ ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న శివ తలకు తీవ్రగాయమై మృతిచెందాడు. అదేరోజు చేజర్ల సమీపంలోని బోడిపాడు వద్ద వ్యాన్, బైక్ ఢీకొని బైక్‌పై ప్రయాణిస్తున్న షర్ఫుద్దీన్ తలకు తీవ్రగాయాలై మృతిచెందాడు. అలాగే గత నెల 27న జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పి బైక్ నడుపుతున్న వ్యక్తి కింద పడ్డాడు. వెనుక నుంచి వస్తున్న ట్యాంకర్ అతని తలపైకి ఎక్కడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ నెల 5న బుజబుజనెల్లూరు సరీ ్వస్ రోడ్డు వద్ద బైక్ అదుపుతప్పి కింద పడడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి తలకు తీవ్రగాయమై ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. ఈ ఘటనలన్నీ ఇటీవల జరిగినవే. అందరూ తలకు బలమైన గాయాలై మృతిచెందిన వారే. హెల్మెట్ ధరించి ఉంటే కనీసం కొందరైనా గాయాలతో బయటపడే అవకాశం ఉండేది. చిన్నపాటి నిర్లక్ష్యంతో విలువైన ప్రాణాలను కోల్పోయినట్లు తెలుస్తోంది.

తలకు తీవ్రగాయాలై..

గతేడాది జిల్లాలో ద్విచక్రవాహన ప్రమాదాల్లో 85 మంది హెల్మెట్ ధరించక మృతిచెందారు. వందలాది మంది క్షతగాత్రులయ్యారు. ఈ ఏడాది ఇప్పటివరకు 11 మందికి పైగా రోడ్డు ప్రమాదాల్లో శిరస్త్రాణం ధరించక దుర్మరణం పాలయ్యారు. ద్విచక్రవాహనం అనేది అత్యంత ప్రమాదకారి. ప్రమాదం చోటుచేసుకున్నప్పుడు వాహనదారుడు నేరుగా రోడ్డుపై పడడం లేదా ఎగిరిపడడం, మరేదైనా వాహనాన్ని, వస్తువును శరీరం బలంగా ఢీకొనడం జరుగుతోంది. దీంతో వాహనదారుడు అక్కడికక్కడే మృతిచెందే ప్రమాదం ఉంది. అయితే అత్యధిక ప్రమాదాల్లో తలకే తీవ్రగాయాలవుతున్నాయి. ముఖ్యంగా వాహన వేగంతో సమానంగా ప్రయాణించే శరీరం ప్రమాద సమయంలో అంతే వేగంతో నేలను తాకుతుంది. ఇలాంటి సమయాల్లో తలకు హెల్మెట్ ఉంటే శిరస్సుకు గాయాలు కాకుండా రక్షణగా ఉంటుంది.

నాసిరకం వద్దు

ద్విచక్రవాహనం కొనుగోలు గురించి ఎంతగానో ఆలోచించి పెద్ద మొత్తంలో నగదు వెచ్చించి కొనుగోలు చేస్తారు. అయితే ప్రాణానికి అత్యంత భద్రత కల్పించే హెల్మెట్ విషయంలో మాత్రం వాహనదారులు అశ్రద్ధ కనబరుస్తున్నారు. రహదారుల వెంట దొరికే నాసిరకం, తక్కువ ధరకు లభించే హెల్మెట్‌లను కొనుగోలు చేస్తున్నారు. ఇవి ప్రమాదాల్లో వాహనచోదకులను రక్షించవని పలు పరిశీలనల్లో తేలింది. నాణ్యమైన హెల్మెట్ వాడితే ప్రాణాలను రక్షించుకోవచ్చు. బీఐఎస్ స్టాండర్డ్స్ ప్రకారం తయారు చేసిన వాటిని కొనుగోలు చేయాలి. వీటిలో సాగేతత్వం కలిగిన పాలీస్టిరీస్ వినియోగిస్తారు. ఇది కుషన్‌లా ఉపయోగపడుతుంది. ప్రమాదాలు జరిగినపుడు తలకు దెబ్బతగలకుండా కాపాడుతుంది. ప్రమాద తీవ్రతను తగ్గిస్తుంది. ప్రామాణికమైన హెల్మెట్‌లో పాలీకార్బొనేట్ కార్బన్ ఫైబర్ వాడతారు.



ఇటీవల గొలగమూడి క్రాస్‌రోడ్డు సమీపంలో హైవేపై జరిగిన ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తిని పరిశీలిస్తున్న ట్రాఫిక్ పోలీసులు(ఫైల్)

అవగాహన కార్యక్రమాలు

'హెల్మెట్‌తో ప్రాణాలు భద్రం' అనే నినాదంతో జిల్లావ్యాప్తంగా పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రయాణాల్లో హెల్మెట్ ధరించకుండా ఉండడం ప్రాణాంతకంగా మారుతోందన్న విషయాన్ని ద్విచక్రవాహనచోదకులు గమనించాలని, బైక్ నడపబోయే ముందు తమ కుటుంబసభ్యుల గురించి ఆలోచించాలని, ప్రధానంగా బైక్‌పై సెల్‌ఫోన్ చేయకూడదని సూచిస్తున్నారు. ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

జిల్లాలో ద్విచక్రవాహన ప్రమాదాల్లో హెల్మెట్ ధరించక మృతిచెందిన వారు	గతేడాది - 85 మంది
ఈ ఏడాది ఇప్పటివరకు..	11 మంది

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి



రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయాలై మృత్యువాత పడుతున్న కేసులు అధికంగా ఉంటున్నాయి. వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్నా నిర్లక్ష్యం వీడడం లేదు. నిబంధనల కోసమే హెల్మెట్ అని కాకుండా తమ ప్రాణాల రక్షణ కోసం ధరిస్తున్నామని వాహనదారులు భావించాలి. ద్విచక్రవాహన చోదకులు ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలి.

– ఎండీ అబ్దుల్ సుభాన్, ట్రాఫిక్ డీఎస్పీ

ప్రయోజనాలు

- రోడ్డు ప్రమాదం జరిగినా తలకు గాయాలు కావు.
- ప్రమాద తీవ్రత పెద్దదైనా హెల్మెట్ మనిషి ప్రాణాన్ని కాపాడుతుంది.
- కళ్లలోకి దుమ్ము, ధూళి వెల్లదు. చెవులకు శబ్ద కాలుష్యం తప్పుతుంది.

కందుకూరులో 72.09 శాతం పోలింగ్



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్

కందుకూరు: కందుకూరులో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 72.09 పోలింగ్ శాతం నమోదు కాగా, టీచర్స్‌కు సంబంధించి 96.14 పోలింగ్ శాతం నమోదైంది. 14,505 పట్టభద్రుల ఓట్లు ఉండగా పోలింగ్ ముగిసే సమయానికి 10,457 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉపాధ్యాయ ఎన్నికలకు సంబంధించి 700 ఓట్లు ఉండగా 673 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి పట్టభద్రుల ఓటును బాలుర ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, సబ్‌కలెక్టర్ శోభిక పరిశీలించారు. పోలింగ్ సరళిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటర్లు ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. డీఎస్పీ కండే శ్రీనివాసులు, సీఐ వెంకట్రావ్ ఆధ్వర్యంలో కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.

అనుమానాస్పదస్థితిలో వృద్ధుడి మృతి

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని రేబాల గ్రామానికి చెందిన వృద్ధుడు రేబాల కోటయ్య(72) బాత్‌రూంలో రక్తపుమడుగులో అనుమానాస్పదంగా మృతిచెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు కోటయ్య తన భార్య ఆదిశేషమ్మతో కలిసి గ్రామంలోని ఓ ఇంట్లో ఉండగా, ఆయన కుమారుడు కోటేశ్వరరావు స్థానికంగానే మరో ఇంట్లో తన కుటుంబంతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. రెండు రోజుల క్రితం కోటయ్య భార్య తమ బంధువుల పెళ్లి వేడుకలకు వెళ్లగా కోటయ్య ఒక్కడే ఇంట్లో ఉంటున్నాడు. అయితే కోటయ్య కుమారుడు కోటేశ్వరరావుకు ఆరోగ్యం సరిగా లేక తన కుమారుడితో కలిసి కాగుళ్లపాడు వద్ద ఉన్న ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. అనంతరం కోటేశ్వరరావు బుచ్చిరెడ్డిపాళెంకి వచ్చి ఎమ్మెల్సీ ఓటు వేశాడు. అప్పుడే కోటేశ్వరరావు తల్లి తాను బుచ్చిరెడ్డిపాళెంలో బస్సు దిగుతున్నానని చెప్పడంతో అతను బస్టాండ్‌కు వెళ్లి తన తల్లి, కుమారుడితో కలిసి రేబాలకు వెళ్లాడు. ఇంట్లోకి వెళ్లగానే మనవడు తాత కనిపించడంలేదంటూ బాత్‌రూం వైపు వెళ్లగా కోటయ్య రక్తపుమడుగులో పడి ఉండడాన్ని గుర్తించి కోటేశ్వరరావుకు తెలిపాడు. అనంతరం వారు పోలీసులకు సమాచారం అందించారు. అయితే తలపై అక్కడక్కడా గాయాలు ఉండడంతో కుమారుడు కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరప్రతాప్ తెలిపారు.



కోటయ్య మృతదేహం

గుండెపోటుతో వలంటీర్ హఠాన్మరణం

అనుమసముద్రంపేట: గుండెపోటుతో గ్రామ వలంటీర్ మృతిచెందిన ఘటన ఏఎస్‌పేట మండలంలోని గుడిపాడు గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు గ్రామంలోని ఎస్సీకాలనీకి చెందిన వెంగళరావు(33) గుడిపాడు సచివాలయం పరిధిలో వలంటీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం అతను ఇంట్లో ఉండగా గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు చికిత్సనిమిత్తం ఆత్మకూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. అయితే వారు మరునాడు ఉదయం నెల్లూరుకు తీసుకువెళ్లవచ్చని నేరుగా గ్రామానికి వెళ్లారు. అర్ధరాత్రి సమయంలో మళ్లీ గుండెనొప్పి అధికంగా రావడంతో అతను కేకలు వేశాడు. కుటుంబసభ్యులు వైద్యశాలకు తరలించే ప్రయత్నంలో ఉండగానే ఇంట్లోనే కుప్పకూలి మృతిచెందాడు. వెంగళరావుకు భార్య సుజాత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అతని మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



వలంటీర్ వెంగళరావు(ఫైల్)

నెల్లూరులో పైప్‌లైన్ గ్యాస్ కనెక్షన్లు ఇవ్వలేదు

సాక్షి, న్యూఢిల్లీ: నెల్లూరు జిల్లాలో ఒక్క పైప్‌లైన్ గ్యాస్ కనెక్షన్(పీఎన్‌జీ) ఇవ్వలేదని కేంద్ర పెట్రోలియం సహజ వనరులశాఖ సహాయ మంత్రి రామేశ్వర్ తేలి తెలిపారు. రాజ్యసభలో సోమవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. 2029 జూన్ 30 నాటికి నెల్లూరు జిల్లాలో 8.52 లక్షల పీఎన్‌జీ, 81 సీఎన్‌జీ స్టేషన్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు కేవలం 15 సీఎన్‌జీ స్టేషన్లు మాత్రమే ఏర్పాటయ్యాయని తెలిపారు.

పోలవరంలో కావలి వాసి మృతి



ఆదిరెడ్డి(ఫైల్)

కావలి: ఏలూరు జిల్లా పోలవరం ప్రాజెక్ట్ డివిజన్–1 ఈఈగా విధులు నిర్వర్తిస్తున్న కావలి పట్టణానికి చెందిన పానుగోటి ఆదిరెడ్డి సోమవారం గుండెపోటుతో మృతిచెందారు. పట్టణంలోని పాతూరులో బొమ్మారెడ్డివారివీధికి చెందిన ఆదిరెడ్డి మృతితో ఆయన బంధువుల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆదిరెడ్డి స్థానికంగా ఉన్న రామకృష్ణ ప్రాథమికోన్నత పాఠశాలలో, జెడ్పీ హైస్కూల్‌లో, జవహర్ భారతి జూనియర్ కళాశాలలో విద్యాభ్యాసం చేశారు.

కుక్కల దాడిలో రైల్వే గార్డ్‌కు గాయాలు

బిట్రగుంట: బోగోలు మండలం విశ్వనాథరావుపేటలో కుక్కలు దాడి చేయడంతో సోమవారం విధులకు వెళుతున్న రైల్వేగార్డ్ గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. రైల్వేగార్డ్ శ్రీనివాసులు విధులకు హాజరయ్యేందుకు స్కూటీపై వెళుతుండగా కుక్కలు వెంట పడ్డాయి. దీంతో స్కూటీ అదుపుతప్పి కిందపడిపోగా కుక్కలు శ్రీనివాసులుపై దాడి చేసి గాయపరిచాయి. స్థానికులు వెంటనే స్పందించి కుక్కలను తరిమేశారు. క్షతగాత్రుడిని చికిత్సనిమిత్తం 108 వాహనంలో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- 2,168 మంది విద్యార్థులు

ఆత్మకూరు: ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయని, ఇందుకు సంబంధించి ఆత్మకూరు పట్టణంలో నాలుగు పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇంటర్మీడియట్ బోర్డు ఆర్‌ఐఓ పి.వరప్రసాద్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వాసుబాబు తెలిపారు. సోమవారం స్థానిక ప్రభుత్వ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఆర్‌ఐఓ మాట్లాడారు. ఆత్మకూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీ బాలికల పాఠశాల, షిరిడి సాయిరాం కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, ప్రథమ, ద్వితీయ ఇంటర్మీడియట్ జనరల్, ఒకేషనల్ పరీక్షలకు మొత్తం 2,168 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. విద్యార్థులకు హాల్‌టికెట్లు అందజేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రానికి ఉదయం 9 గంటల లోపు చేరుకోవాలని, ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షలకు అనుమతిలేదని తెలిపారు. ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్‌ఫోన్లకు అనుమతిలేదన్నారు. నిరంతరం పరీక్షలను ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనల మేరకు సిటింగ్‌స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్, బోర్డు స్టేట్ అబ్జర్వర్లు, హైపవర్ కమిటీ, జిల్లా పరీక్షల కమిటీ పర్యవేక్షిస్తాయని తెలిపారు. సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ ఉంటుందన్నారు. సీసీ కెమెరాల ద్వారా ఇంటర్మీడియట్ బోర్డుకి, ఆర్‌ఐఓ కార్యాలయానికి అనుసంధానం చేసినట్లు తెలిపారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

ఉరేసుకుని టైలర్ ఆత్మహత్య

- విచారిస్తున్న పోలీసులు

నెల్లూరు(క్రైమ్): స్నేహితురాలు దూరం పెట్టిందన్న మనస్తాపంతో ఓ టైలర్ తన దుకాణంలోనే ఆత్మహత్య చేసుకున్న విషయం సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతదేహం కుళ్లి నీచునీరు బయటకు రావడం, దుర్గంధం వెదజల్లుతుండటాన్ని గుర్తించిన స్నేహితురాలు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని షట్టర్ పగులగొట్టి మృతదేహాన్ని వెలికితీశారు. పోలీసులు, బాధితుల సమాచారం మేరకు.. పోస్టల్‌కాలనీ ఆరోవీధికి చెందిన పచ్చియప్పన్ రామస్వామి(48) – రాజేశ్వరి దంపతులు. వారికి సంతోష్‌కుమార్, ఐశ్వర్య సంతానం. ఆయన టైలరింగ్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతను కరెంటాఫీస్ సెంటర్‌లో టైలరింగ్ దుకాణం నిర్వహిస్తున్నప్పుడు చంద్రమౌళినగర్‌కు చెందిన కె.సుభాషిణి ఆయన వద్ద పనికి చేరారు. ఆమె భర్త నుంచి విడిపోయి దూరంగా ఉంటోంది. ఈ క్రమంలో వారి మధ్య సాన్నిహిత్యం పెరిగింది. ఇద్దరూ సహజీవనం చేయసాగారు. ఈ విషయమై రామస్వామికి, భార్య రాజేశ్వరికి మధ్య మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. అయినా రామస్వామి ఇవేమీ పట్టించుకోలేదు. స్నేహితురాలి వద్దనే ఎక్కువ సమయం గడిపేవాడు. అప్పుడప్పుడు భార్య, పిల్లల వద్దకు వచ్చివెళ్లేవాడు.



కుటుంబసభ్యుల నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

స్నేహితురాలికి విద్యుత్‌భవన్ వద్ద పండ్ల వ్యాపారం పెట్టించాడు. దాని పక్కనే ఆయన టైలరింగ్ షాపు నిర్వహిస్తున్నాడు. స్నేహితురాలి కుమారుడు, కోడలు ఆమంచర్లలో ఉంటున్నారు. వారు ఆర్థికంగా నష్టపోయి ఇటీవల తల్లి వద్దకు వచ్చారు. రామస్వామి సైతం వారికి చేదోడువాదోడుగా ఉండేవాడు. అయితే గత కొద్దిరోజులుగా వారిని ఇంటి నుంచి పంపివేయాలని రామస్వామి స్నేహితురాలిపై ఒత్తిడి తేవడంతోపాటు విపరీతంగా కొట్టేవాడు. దీంతో ఆమె దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు ఆయనకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అయినా అతని ప్రవర్తనలో మార్పురాలేదు. దీంతో సుభాషిణి అతనిని దూరం పెట్టింది. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన రామస్వామి తన స్నేహితుడి ద్వారా సుభాషిణితో రాజీప్రయత్నాలు చేశాడు. అయినా ఆమె పట్టించుకోలేదు. శనివారం భార్య, పిల్లల వద్దకు వెళ్లి కొంతసేపు వారితో గడిపి అనంతరం షాపునకు వచ్చాడు. షాపులోనే మద్యం తాగి స్నేహితురాలి కోడలితో గొడవపడ్డాడు. షట్టర్ లోపల గడియపెట్టుకుని ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భర్త ఇంటికి రాకపోవడంతో స్నేహితురాలి వద్దకు వెళ్లి ఉంటాడని రాజేశ్వరి, తాను దూరం పెట్టడంతో భార్య వద్దనే ఉంటాడని స్నేహితురాలు భావించారు. సోమవారం సుభాషిణి పండ్ల షాపునకు వచ్చింది. రామస్వామి టైలరింగ్ షాపులో నుంచి నీచునీరు బయటకు రావడం, దుర్గంధం వస్తుండడాన్ని గమనించిన ఆమె దర్గామిట్ట పోలీసులకు సమాచారం ఇచ్చింది. దర్గామిట్ట ఏఎస్సై బుజ్జయ్య, హెడ్‌కానిస్టేబుల్ భాస్కర్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే రామస్వామి భార్య, కుటుంబసభ్యులు కూడా అక్కడకు చేరుకున్నారు. కుటుంబసభ్యులు, స్థానికుల సహకారంతో పోలీసులు షట్టర్ పగులగొట్టి చూడగా రామస్వామి ఉరేసుకుని ఉన్నాడు. మృతదేహం కుళ్లి తీవ్ర దుర్గంధం వెదజల్లుతూ ఉండడంతో శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. స్నేహితురాలే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేసిందని రామస్వామి భార్య ఆరోపించింది. తన భర్త మృతిపై విచారణ జరిపి అందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ఒకరు మృతి

- ఇద్దరికి గాయాలు

బుచ్చిరెడ్డిపాళెం: విద్యుదాఘాతంతో హరీష్(23) అనే యువకుడు మృతిచెందగా శివకుమార్, పూర్ణ అనే ఇద్దరికి గాయాలైన ఘటన బుచ్చిరెడ్డిపాళెంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబసభ్యులు కథనం మేరకు సంగం మండలం తరుణవాయి గ్రామానికి చెందిన హరీష్ పొలాల్లో బోర్లు వేస్తూ జీవనం సాగిస్తుంటాడు. అందులో భాగంగా బుచ్చిరెడ్డిపాళెంలోని ఓ లేఅవుట్ సమీపంలో ఉన్న పొలంలో బోరు వేసేందుకు రేబాలకు చెందిన శివకుమార్, పూర్ణలను తీసుకెళ్లాడు. పొలంలో బోరు వేస్తుండగా అనుకోకుండా ఇనుప రాడ్డు 11 కేవీ విద్యుత్ వైర్లకు తగిలింది. ఈ ప్రమాదంలో హరీష్ అక్కడికక్కడే మృతిచెందగా, శివకుమార్, పూర్ణలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వారిని చికిత్సనిమిత్తం బుచ్చిరెడ్డిపాళెంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	109
లేయర్ (లైవ్)	75
బ్రాయిలర్ చికెన్	194
బ్రాయిలర్ స్కిన్‌లెస్	216
లేయర్ చికెన్	128



పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	రూ.92
సన్నవి	రూ.85
పండ్లు	రూ.45

